క్లుప్తంగా

జాతరలో ఎమ్మెల్యే వనమా



పూజలో పాల్గొన్న వనమా వెంకటేశ్వరరావు

చుంచుపల్లి: చుంచుపల్లి తండాలో జరుగుతున్న పెద్దమ్మ తల్లి జాతరకు కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు శనివారం హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెద్దమ్మతల్లి దయతో కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు.

స్వచ్ఛ భారత్ ఆటో డ్రైవర్ల సంఘం ఎన్నిక



ఎన్నికైన సంఘం సభ్యులు

పాల్వంచ: పాల్వంచ మున్సిపాలిటీ స్వచ్ఛ భారత్ ఆటో యూనియన్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోళ్ల పూడి ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బర్ల నాగరాజు, ఉపాధ్యక్షుడిగా యమ్మన మల్లికార్జునరావు, గౌరవ సలహాదారులుగా ధరావత్ బాలాజీ, ఉప కార్యదర్శిగా కంచెర్ల హుస్సేన్, కోశాధికారిగా కాంపెల్లి రాము, కాకటి నాగేంద్రబాబులను ఎన్నుకున్నారు.

దళిత హక్కుల పోరాట సమితి కమిటీ ఎన్నిక

సింగరేణి(కొత్తగూడెం): దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా రుద్రంపూర్‌కు చెందిన బందెల నర్సయ్య, సహాయ కార్యదర్శిగా సలిగంటి శ్రీనివాస్, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా లక్ష్మీదేవి మండలం శేషగిరినగర్‌కు చెందిన కే.రత్నకుమారిని ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో జరిగిన రాష్ట్ర మహాసభలో వీరిని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

వితరణ



రేకులు అందిస్తున్న జలగం యువసేన సభ్యులు

సుజాతనగర్: శుక్రవారం వచ్చిన గాలివాన కారణంగా నష్టం వాటిల్లిన నాయకులగూడెం గ్రామంలోని మూడు కుటుంబాలకు గ్రామ సర్పంచ్ నాగరాజేశ్వరి ఆధ్వర్యంలో శనివారం వితరణ చేశారు. గ్రామంలోని ఇళ్లపై చెట్లు పడి ఇళ్లు ధ్వంసం కాగా.. ఆయా కుటుంబాలకు ఇంటి పైకప్పుకు రేకులు అందజేసి సర్పంచ్ మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో చింతలపూడి జగన్, బొడ్డు కేశవరావు, మండె చంటి పాల్గొన్నారు.

మహిళల కబడ్డీ పోటీలు

ఇల్లెందురూరల్: కొమరారం, బోడు గ్రామాలను మండల కేంద్రాలుగా, ఇల్లెందును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కొమరారం గ్రామంలో న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శనివారం మహిళలకు నాలుగు మండలాల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు పోటీలను ప్రారంభించారు. మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్ష, అవకాశం, వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ నూతన మండలాలు, రెవెన్యూ డివిజన్ ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించేలా చేపడుతున్న నిరసన కార్యక్రమాలలో భాగంగానే మహిళలకు కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సర్పంచ్‌లు బానోత్ సంతు, మోకాళ్ల కృష్ణ, శ్రీనివాస్, రజిత, సరోజిని, మోతీలాల్, కృష్ణ పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో రాణిస్తున్న మహిళలు

- న్యాక్ ద్వారా టైలరింగ్‌లో ఉచిత శిక్షణ
- 30 మంది చొప్పున మూడు నెలలకో బ్యాచ్
- ఆపై కుట్టు మిషన్లు ఉచితం

సండే స్పెషల్



హరిప్రియ ఫౌండేషన్ భవన్‌లో కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు

ఇల్లెందు: పురుషులతో సమానంగా స్వశక్తితో మహిళలు రాణిస్తున్నారు. ఇంటి నుంచే స్వయం ఉపాధితో ఆదాయ మార్గాల మీద దృష్టి పెడుతున్నారు. ఇందులో ముఖ్యంగా టైలరింగ్‌ను నేర్చుకోవటం ద్వారా ఉపాధి మార్గాన్ని ఎంచుకుంటున్నారు. చాలామంది మహిళలు టైలరింగ్‌లో డిజైన్లు, అల్లికలు నేర్చుకుని ఉపాధి పొందుతున్నారు. హరిప్రియ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యాక్ ద్వారా మహిళలకు ఉచిత శిక్షణ, ధ్రువపత్రం అందిస్తున్నారు. కార్మిక శాఖ ద్వారా కుట్టు మిషన్లు అందజేస్తున్నారు. ఏడాది కాలంగా ఇల్లెందులోని జేకే సింగరేణి సీఈఆర్ క్లబ్ గ్రౌండ్ సమీపంలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో హరిప్రియ ఫౌండేషన్ భవన్‌లో నాలుగు బ్యాచ్‌లు శిక్షణ పొందారు. ఒక్కో బ్యాచ్‌కు 30 మంది మహిళలు, మూడు నెలల పాటు శిక్షణ పొంది కుట్టు మిషన్, ధ్రువపత్రంతో ఇంటికి వెళుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇక్కడ శిక్షణ ఇచ్చి మిషన్లు ఇస్తున్నారు. ఇలా శిక్షణ పొందిన మహిళలు ఇంటి వద్ద స్వయంగా కుట్టు పని చేసుకుంటూ ఆదాయం పొందుతున్నారు. కొంతమంది ఐదారుగురు ఒక గ్రూపుగా టైలరింగ్ షాప్ నెలకొల్పి జీవనోపాధి పొందుతున్నారు. ఈ శిక్షణలో శిక్షకురాలితో డిజైన్ జాకెట్లు, చీరెలకు పాల్స్, 12 రకాలుగా డోర్ కర్టెన్లు, కుర్తాలు, సూట్లు, సల్వార్, కమీజ్‌లు కట్టడం నేర్పుతున్నారు. అంతేకాకుండా టైలరింగ్‌లో మెళకువలు కూడా నేర్పుతున్నారు. కత్తెర వాడటం, మార్కింగ్ కోసం సుద్ద, కొలతలు, సూదులు, సీమ్ ఓపెనర్, వర్క్ ఎయిడ్స్, హెమ్మింగ్, పికోట్ స్టిచ్ కోసం ప్రత్యేక ప్రెజర్ ఫుట్ వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. ఏడాది కాలంలో 126 మంది మహిళలు కుట్టు శిక్షణ పొంది జీవనోపాధి పొందుతున్నారు.



శిక్షణ ఇస్తున్న శిక్షకురాలు నాగమణి

గౌరవంగా జీవించవచ్చు



టైలరింగ్ వృత్తిలో స్థిరపడిన మహిళలు ఇంటి వద్దనే పని చేసుకుంటూ గౌరవంగా జీవించవచ్చు. మోడ్రనైజేషన్ నేర్చుకుంటే ఇంకా ఉపయోగంగా ఉంటుంది. కుటుంబానికి చేయూతగానూ ఉంటుంది. నలుగురు కలిసి ఒక షాపు ఏర్పాటు చేసుకుంటే గిరాకీ ఉంటుంది. అందరికీ ఆదాయం లభిస్తుంది.

– నాగమణి, కుట్టు శిక్షణ కేంద్రం(న్యాక్) శిక్షకురాలు

టైలరింగ్‌తో ఉపాధి ..



టైలరింగ్ నేర్చుకోవటం ద్వారా ఉపాధి లభిస్తోంది. ఇంటిల్లిపాదికి బట్టలు కుట్టుకునే అవకాశం ఉంటుంది. ఇంటి వద్ద ఖాళీ సమయంలో ఇలాంటి పని చేయటం ద్వారా సమయం వృథా కాదు. మహిళలకు టైలరింగ్ వస్తే ఇంటి నుంచే ఆదాయం పొందుతూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటుంది.

– పోటు సంధ్య, నెంబర్–2 బస్తీ, ఇల్లెందు

న్యాక్ ద్వారా ఉచిత శిక్షణ..



ఇల్లెందులోని హరిప్రియ ఫౌండేషన్ భవన్‌లో న్యాక్ – లేబర్ ఆఫీస్ ద్వారా ఉచిత శిక్షణ తీసుకున్నాము. టైలరింగ్ చేయటం వల్ల ఆదాయం వస్తోంది. నేటి తరం మహిళలు ఫ్యాషన్ దుస్తులు కోరుకుంటున్నారు. దీనికి అనుగుణంగా మెళకువలు నేర్చుకుంటే మరింత ఆదాయం పొందవచ్చు.

– ఉషశ్రీ , 14వ వార్డు, ఇల్లెందు

రాహుల్ గాంధీపై వేటు అప్రజాస్వామికం

జూలూరుపాడు: రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడం అప్రజాస్వామికమని టీపీసీసీ సభ్యుడు మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శనివారం జూలూరుపాడులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ, అదానీని పార్లమెంట్‌లో ప్రశ్నించినందుకే రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేశారన్నారు. మోదీ ప్రభుత్వం చట్టాలను తుంగలో తొక్కుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఆరోపించారు. శిక్షలకు, బెదిరింపులకు భయపడేది లేదని, ప్రజల పక్షాన తమ గొంతు విప్పుతానని రాహుల్ గాంధీ స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. ఆర్థిక నేరగాళ్లు నీరవ్ మోదీ, లలిత మోదీలతో మోదీకి ఉన్న సంబంధం ఏమటని ప్రశ్నించడం నేరమా అన్నారు. ప్రశ్నించిన వారిపై దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐలతో దాడులు చేయించి లొంగదీసుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ నియంత పాలనను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించడం ఖాయమన్నారు. సమావేశంలో బొడ్డు కృష్ణయ్య, లకావత్ లచ్చు నాయక్, పమ్మి అశోక్‌కుమార్, మందా బాబు, తాళ్లూరి అచ్చయ్య, చాపలమడుగు నరసింహారావు, బానోత్ బాబు, భూక్యా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీని మళ్లించండి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న రైతులు

పాల్వంచరూరల్: పెద్దమ్మగుడి వద్ద గల ఫంక్షన్ హాళ్ల నుంచి వచ్చే మురుగు పంటపొలాలకు వెళ్లే ప్రధాన రహదారిపై ప్రవహించడంతో దుర్గంధం వెదజల్లుతోందని ఆ మురుగునీటిని మళ్లించాలని పలువురు రైతులు తహసీల్దార్ రంగాప్రసాద్‌కు శనివారం విన్నవించారు. మండల పరిధిలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య గల పెద్దమ్మగుడి వద్ద ఫంక్షన్ హాళ్లకు డ్రెయినేజీ లేకపోవడంతో అక్కడ వాడుకున్న నీరంతా పంటపొలాలకు వెళ్లే మార్గంలోని రహదారిపైకి వస్తున్నాయని చెప్పారు. ఇటీవల ఓ రైతు అడ్డంగా కట్టవేయడంతో మురుగు రోడ్డుపైనే నిల్వ ఉంటోందని నిత్యం ఈ మార్గంలో రైతులు రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. స్పందించిన తహసీల్దార్ చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో బి.వీరారెడ్డి, గోళ్ల రాంబాబు, సంగెం గోపాలకృష్ణ, అల్లం బ్రహ్మం, లక్ష్మణ్ ఉన్నారు.

చౌకదుకాణాల్లో అన్ని సరుకులు ఇవ్వాలి

ఇల్లెందురూరల్: కార్పొరేట్ శక్తులకు పన్ను రాయితీ, మాఫీ కల్పిస్తున్న పాలకులు పేదలకు రేషన్ షాపుల ద్వారా 12రకాల నిత్యావసర వస్తువులు, 10 కిలోల సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేయాలని పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్ డిమాండ్ చేశారు. ఇల్లెందులో శనివారం ఏర్పాటైన పీవైఎల్ మండల శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారుల అనుకూల నిర్ణయాలు తీసుకుంటూ సామాన్యులపై భారం మోపుతున్నారని విమర్శించారు. వంట గ్యాస్ ధరలను భరించలేని స్థితికి తీసుకెళ్లిన పాలకులు చివరకు సబ్సిడీని కూడా ఎత్తివేశారని ఆరోపించారు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ ఉద్యమాలు నిర్మించి పాలకులకు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రగతిశీల యువత సిద్ధం కావాలని సూచించారు. సమావేశంలో బుచ్చిరాజు, అజయ్, ఈసం కృష్ణ, గణేష్, దేవా, భాస్కర్, రామకృష్ణ, కోటేష్, అర్జున్, బండారి సత్యం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రదీప్


విరాళం



చెక్కు అందజేస్తున్న రంగాకిరణ్

చుంచుపల్లి: రిటైర్డ్ ఉద్యోగులకు అండగా ఉంటానని బీజేపీ జాతీయ మీడియా సెల్ కోఆర్డినేటర్ కేవీ.రంగాకిరణ్ అన్నారు. శనివారం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం చుంచుపల్లి మండల యూనిట్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న భవనానికి ఆయన రూ.1,11,116 విరాళంగా అందజేశారు. మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు తనవంతు సాయంగా నిలుస్తానని చెప్పారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల ప్రెసిడెంట్ అంకం పాపయ్య, గౌరవ అధ్యక్షుడు శేషగిరిరావు, వైస్ ప్రెసిడెంట్ భానుమతి, కోశాధికారి కేశవరావు, శివరాం తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్లు పంపిణీ



కిట్లు అందజేస్తున్న ఖలీల్ పాషా

చుంచుపల్లి: వైఎస్సార్ తెలంగాణ పార్టీ కొత్తగూడెం నియోజకవర్గం ఇన్‌చార్జ్ షేక్ ఖలీల్ పాషా ఆధ్వర్యంలో పెనగడప శ్రీనగర్ కాలనీకి చెందిన క్రీడాకారులకు శనివారం వాలీబాల్, క్రికెట్ కిట్లను అందజేశారు. మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను పట్టించుకోవడం లేదని, క్రీడాకారులు వెలుగులోకి రావాలంటే వైఎస్సార్ టీపీ అధికారంలోకి రావాలన్నారు. యువకులు శారీరక, మానసికోల్లాసంతో ఉండాలంటే క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో షేక్ జలీల్, భూక్యా తేజ నాయక్, గంగుల సాయిరెడ్డి, బండి నాగరాజు, ప్రసాద్‌రెడ్డి, యాకుబ్ పాషా, వాడేపల్లి చిరంజీవి, కాకెళ్లి చంటి, బన్నీ, సాధిక్, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్టూ మహాసభలను జయప్రదం చేయండి

సింగరేణి(కొత్తగూడెం): ఈరోజు, రేపు కొత్తగూడెంలో జరగనున్న భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) మహాసభలను జయప్రదం చేయాలని ఆపార్టీ జిల్లా నాయకుడు ఎల్.విశ్వనాథం పిలుపునిచ్చారు. శనివారం మహాసభల ప్రచార కార్యక్రమం కొత్తగూడెం పట్టణంలోని పలు కార్మికుల అడ్డాలలో నిర్వహించారు. మాట్లాడుతూ.. 3వ తేదీన కొత్తగూడెంలో ర్యాలీ అనంతరం కొత్తగూడెం క్లబ్‌లో ప్రతినిధుల సభ, 4న ఉర్దూఘర్‌లో మహాసభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో పట్టణ ప్రముఖులు, మేధావులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సాధినేని వెంకటేశ్వరరావు, సీతారామయ్య, న్యాయవాది ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిలర్ల ఆందోళన



ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలో జరిగే అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు నివేదిక అందజేయడానికి ఏర్పాటు చేసే క్వాలిటీ కంట్రోల్ టెండర్‌లో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని అధికార పార్టీ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. మాట్లాడుతూ.. ఆఫ్‌లైన్ టెండర్ నిర్వహించి అధికారులకు అనుకూలంగా ఉన్న వారికి టెండర్‌ను అప్పగించారని ఆరోపించారు. రూ.75 కోట్ల డీఎంఎఫ్ నిధులు, రూ.45 కోట్ల సీఎం నిధులు, రూ.30 కోట్లు జనరల్ ఫండ్ మొత్తం రూ.150 కోట్లతో కొత్తగూడెంలో అభివృద్ధి పనులకు గాను క్వాలిటీ కంట్రోల్‌ను టెండర్ ప్రక్రియ ద్వారా రూ.1.50 కోట్లకు అధికారులకు అనుకూలంగా ఉన్న క్యూబా కంపెనీకి అప్పగించినట్లు తెలిపారు. వారి కన్నా తక్కువకు టెండర్ దాఖలు చేసిన వారికి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. దీంతో పాటుగా డస్ట్‌బిన్లు కూడా రూ.15 లక్షల ఖర్చుతో తెచ్చి మెప్మా కార్యాలయంలో పెట్టారని, వాటి కొనుగోలులో కూడా అవినీతి జరిగిందని ఆరోపించారు. మున్సిపల్ అధికారులు దారి తప్పారని కౌన్సిలర్లను, ఎమ్మెల్యే, కలెక్టర్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ నిధులను దుర్వినియోగం చేయడం సరికాదని, ఏ ప్రతిపాదికన టెండర్ అప్పగించారో చెప్పాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు భీమా శ్రీవల్లి, సాహేరాబేగం, మోరె రూప, రావి మమత, నాయకులు భీమా శ్రీధర్, మహ్మద్ యూసఫ్, రావి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మోదీ విధానాలను వ్యతిరేకించండి



మాట్లాడుతున్న సురేందర్

ఇల్లెందురూరల్: పేద, మధ్య తరగతి ప్రజలపై భారం మోపేలా పన్నులు విధిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ అవలంబిస్తున్న నిరంకుశ విధానాలను ప్రజలు ప్రతిఘటించాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందగట్ల సురేందర్, రాష్ట్ర నాయకుడు ఉమర్ అన్నారు. కొమరారం గ్రామంలో శనివారం ఏర్పాటైన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత నరేంద్ర మోదీ ప్రజలపై భారం మోపడంతోపాటు నిత్యావసర వస్తువుల ధరలను సామాన్యులకు అందనంత ఎత్తుకు పెంచాడని ఆరోపించారు. ఇదిచాలక నేడు ఔషధాల ధరలను కూడా 12శాతం పెంచుతూ నిర్ణయించడం పేదలను ఆర్థిక ఇబ్బందులకు గురిచేయడమేనని విమర్శించారు. కేంద్రప్రభుత్వం తన నిర్ణయాలను ఉపసంహరించుకునే వరకు ప్రజలు ఉద్యమించాలని కోరారు. సమావేశంలో కుంజ కృష్ణ, రాంబాబు, సీతారాములు, నాగేశ్వరరావు, నర్సింహారావు, సత్యం, రాజు, సారయ్య, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో మెరుగైన ఆరోగ్యం



కొత్తగూడెంరూరల్: చిరుధాన్యాలతో వంట చేస్తున్న సీడీపీఓ, మహిళలు



టేకులపల్లి: కొప్పురాయిలో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, పిల్లలు, లబ్ధిదారులు

కొత్తగూడెంటౌన్: ప్రతిఒక్కరూ పోషక విలువలున్న చిరుధాన్యాలతో కూడిన పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని రామవరం సెక్టార్ సూపర్‌వైజర్ సీత అన్నారు. రామవరంలోని 1,2,3,4,6 వార్డుల్లోని సెంటర్లలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ్ పక్షంలో భాగంగా చిరుధాన్యాలను వినియోగించాలని కోరుతూ ప్రతిజ్ఞ చేశారు. వాటితో చేసిన వంటల ప్రదర్శన నిర్వహించి తల్లిదండ్రులకు వాటి ప్రాధాన్యతను వివరించారు. రామవరం వార్డులోని అంగన్‌వాడీ సెంటర్లలో చిరుధాన్యాల ఉపయోగాన్ని తెలియజేస్తూ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీత మాట్లాడుతూ.. అంగన్‌వాడీల్లో గర్భిణులకు, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం విలువలను వివరించారు. చిరుధాన్యాల్లోని సహజ పీచు పదార్థాలు ఆహారం నుంచి రక్తంలోకి గ్లూకోజ్ విడుదల చేసి శక్తిని ఇస్తాయని, అందుకే శరీరానికి శక్తిని, ఆరోగ్యానికి రక్షణను ఇచ్చే చిరుధాన్యాలను అందరూ తప్పక తినాలన్నారు. అనంతరం 5 సంవత్సరాల పిల్లలందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, ఆయాలు, పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు, తలులకు పౌష్టికాహారం అందించాలని సీడీపీఓ కనకదుర్గ అన్నారు. శనివారం లక్ష్మీదేవిపల్లి మండలం అశోక్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు బరువులు తీయించి తల్లులకు సమావేశం నిర్వహించారు. కనకదుర్గ మాట్లాడుతూ.. ప్రతి కుటుంబంలో వారంలో రెండు రోజులైనా చిరుధాన్యాలు తినాలని చెప్పారు. రాగి జావ, జొన్న రొట్టెలు తినటం వల్ల ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటరమణ, అంగన్‌వాడీ టీచర్ పద్మ, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: ఇంటి ఆవరణలో, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల ఆవరణలో పెంచుకునే ఆకుకూరలు, కూరగాయలు ఆరోగ్య సంజీవనులని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కాంపెల్లి మంగతార అన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా శనివారం టేకులపల్లి, బోడు, సులానగరస్, గంగారం, బొమ్మనపల్లి సెక్టార్ల పరిధిలోని 126 అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక పోషకాహార కార్యక్రమాలు నిర్వహించారు. చిరుధాన్యాలతో వంటల ప్రదర్శన, ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింత మంగమ్మ, సూపర్‌వైజర్ గుర్రం శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు పాల్గొన్నారు.

ఘనంగా బుడియాబాపు జాతర



ఇల్లెందురూరల్: పూజ చేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందురూరల్: మండలంలోని విజయలక్ష్మీనగర్ భూపేష్‌నగర్‌లో బంజారా సోదరులు బుడియా బాపు జాతరను శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో బంజారాలు ఐక్యంగా సంత్ సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి భోగ్‌బండారో నిర్వహించారు. ఎమ్మెల్యే బాణోత్ హరిప్రియ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మాట్లాడుతూ.. సంస్కృతి సంప్రదాయాలను మరువకుండా నేటితరానికి తెలియజేస్తూ పండుగలను నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. బుడియాబాపు కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌సాహు, చుక్కసాహు, రమేష్, సీతారాం, సక్రామ్,, రాంపాల్, సేవలాల్, తాండ్ర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ: స్థానిక కరకవాగు వద్దనున్న శ్రీ జగదాంబ దేవి తుల్జా భవానీ ఆలయంలో శనివారం బుడియా బాపు జెండా ప్రతిష్ఠా కార్యాక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త తేజావత్ రాములు, పూజారి నిరోషాబాయ్, శంకర్ సాధు, చందా, రాజు, చందు పాల్గొన్నారు.

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం



జూలూరుపాడు: మాట్లాడుతున్న ఎంఈఓ

జూలూరుపాడు: రేపటి నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు మండల విద్యాశాఖాధికారి గుగులోతు వెంకట్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన ఇన్విజిలేటర్ల శిక్షణ కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడారు. జూలూరుపాడు, పాపకొల్లు, పడమటనర్సాపురం, కాకర్ల, గుండెపుడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, జూలూరుపాడు కేజీబీవీ, పడమటనర్సాపురం గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలల విద్యార్థులతోపాటు, పడమటనర్సాపురం, జూలూరుపాడులలోని ప్రైవేట్ పాఠశాలలైన వశిష్ట విద్యామందిర్, సెయింట్ ఆంటోనియస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలకు చెందిన మొత్తం 358 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు చెప్పారు. రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, జూలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 190 మంది విద్యార్థులు, సెయింట్ ఆంటోనియస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 168 మంది విద్యార్థులను కేటాయించామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఎస్‌లు, డీఓలు, కస్టోడియన్, ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

టేకులపల్లి: పదో తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ శనివారం కొండెంగులబోడుకు చెందిన, జిల్లా ఆర్టిజన్స్ (విద్యుత్ శాఖ ఉద్యోగులు) జేఏసీ చైర్మన్ జర్పుల రాజేందర్ నాయక్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కేజీబీవీలోని పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. ఎస్‌ఓ భూక్యా సంతు, టీచర్లు ధరావత్ పార్వతి, మాళోతు జ్యోతి, లక్ష్మి, సీత పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్, చల్లసముద్రం గ్రామపంచాయతీల పరిధిలో పదో తరగతి విద్యార్థులకు స్థానికులు శనివారం పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. సర్పంచ్ వల్లాల మంగమ్మ, ఎంపీటీసీ శీలం ఉమ, వార్డు సభ్యుడు ఆళ్ల నాగేశ్వరరావు, స్థానికుడు వల్లాల నర్సయ్య పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. సర్పంచ్ తిరుపతి, కుర్ర అరుణ, పోటు రవి, ఎంఈఓ పిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

రక్షణ కల్పించండి..

టేకులపల్లి మండలం లచ్చగూడెం గ్రామపంచాయతీ టేకులగుంపులోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం రెండూ ఒకే ఆవరణలో ఉన్నాయి. పాఠశాలలో 14 మంది విద్యార్థులు, అంగన్‌వాడీలో 10 మంది చిన్నారులు ఉన్నారు. ఈ రెండు భవనాల్లో ఫర్నీచర్, రికార్డులు, వంట సామాన్లు, విలువైన సామగ్రి ఉంటాయి. ఈ రెండూ ఒకే ఆవరణలో ఈ భవనాలకు నేటికీ ప్రహరీ లేక రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. బోరు ఉన్నా ఆ నీరు తాగేందుకు ఉపయోగపడటం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రహరీ నిర్మించాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

– టేకులపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : ఠాకూర్ రాంసింగ్, ఎంఈఓ, టేకులపల్లి
సెల్ నంబర్ : 9849553542